## అగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

### రాత్రి మోటర్ల కాడ పండుకునెటోళ్లం



మంగపేట, నవంబర్ 24 : గత ప్రభుత్వాల హయాంలో రాత్రి పూట కరెంటు ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి ఉండె. పంట చేతికొచ్చేదాకా సబ్ మెర్సిబుల్ మోటర్లు, వ్యవసాయ బావుల కాడ రాత్రంతా కరెంటు కోసం ఎదురు చూస్తూ పండుకునెటోళ్లం. కేసీఆర్ పాలన మొదలైనంక ఆ కష్టాలు లేకుండా పోయినయ్. పదేండ్ల కాలం నుంచి అటు పొలం కాడ, ఇటు ఇంటి కాడ కరెంటు సమస్య అంటె ఎట్ల ఉంటదో తెల్వదు. రైతులంతా సక్కగ రెండు పంటలు పండించుకుంటాండ్రు. ఇప్పుడు కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్, మూడు గంటల కరెంటు అంటాండ్రు. అసలు అంత పెద్ద మోటర్లు పెడితే భూమి లోపల ఆ మోటర్లకు సరిపోయేటన్ని నీళ్లుంటయా? మూడు గంటలకు అర ఎకరమైన తడుస్తదా అనే సోయి లేకుండా రైతులను ఆగం చేసెటానికి చూస్తుండ్రు. గాళ్ల మాటలు నమ్మితె మళ్లీ కరెంటు కష్టాలు షురూ అవడం ఖాయం. గిప్పుడు కేసీఆర్ పాలనల రైతులు కరెంటు కోసం పాములు, విష పురుగుల మధ్య నిద్రించే బాధలు లేవు. రైతుల కరెంటు బాధలు తీర్చిన బీఆర్ఎస్ సర్కారే మళ్లా రావాలని రైతులందరం కోరుకుంటానం.

– బూర్గుల వెంకటమల్లు,బుచ్చంపేట, మంగపేట

### ధరణి పోతే మళ్ల భూ తగదాలె..



టేకుమట్ల : తెలంగాణలో ఎనకటి నుంచి ఉన్న భూ తగాదాలను సీఎం కేసీఆర్ గ్రామాల్లో సభలు పెట్టి ప్రజల సమక్షంలో పరిష్కరించారు. ఇక నుంచి తెలంగాణలో భూ తగాదాలు ఉండకూడదని, అనేక సమాలోచనలు చేసి దరణి తీసుకొచ్చి రైతులకు భూమి హక్కులపై భరోసా కల్పించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ధరణి వల్ల రైతుల ప్రమేయం లేకుండా ఒక్క గుంట భూమి కూడా కబ్జా కాదు. ఇతరుల పేరు మీదకు బదిలీ కాదు. రైతులు భూములు కొనాలన్న, అమ్మాలన్న గంటల వ్యవధిలోనే జరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా చేసుకోవడంతో దళారుల బెడద, కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది. రైతులకు ఎలాంటి కష్టాలు లేకుండా భరోసా ఉన్న ధరణిపై కాంగ్రెసోళ్ల కండ్లు పడి కక్ష సాధింపుగా ధరణిని తీసేస్తాం అనడం రైతులను కష్టాల్లోకి నెట్టడమే అయితది. ధరణి పోతే మళ్ల భూ తగాదాలు మొదలైతయ్.. అందుకే రైతులంత కాంగ్రెస్‌ను ఓడగొట్టేందుకు సిద్ధంగా ఉన్నరు.

– కూర సురేందర్‌రెడ్డి, రైతు, వెల్లంపల్లి, టేకుమట్ల

### ఆ కరెంటు అద్దు.. కాంగ్రెస్ అద్దు..



కాటారం : మాది ఇబ్రహీంపల్లి గ్రామం. నాకు మా ఊరు శివారులో 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇప్పటివరకు 3 హెచ్‌పీ కరెంటు మోటర్లు వినియోగిస్తున్న. కానీ కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అవ్వి తీసేసి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటుర్రు. అదెట్ల సాధ్యమైతది. ఈ ఖర్చులన్ని ఎవ్వరు ఇత్తరు. పోనీ ఖర్చులు భరించి 10 హెచ్‌పీ మోటర్లు పెడితే కరెంటు మీద లోడు పడి మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ఎట్ల. మళ్ల కొత్తవి పెట్టేదాక పొలం ఎండుడేన. 3 గంటల కరెంటు, 10 హెచ్‌పీ మోటర్లు అద్దు. ఆ కాంగ్రెస్ అద్దు. ఇప్పుడున్న కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంటు చాలు.

– గండు సమ్మిరెడ్డి, రైతు, ఇబ్రహీంపల్లి, కాటారం

### అప్పట్ల కాళ్లరిగేలా తిరిగేది..



మల్హర్ : గత ప్రభుత్వంల భూముల పట్టాల కోసం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పనులు కాలేదు. కాని బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి చాలా బాగుంది. ఆరగంటలో భూమి రిజిస్ట్రేషన్ అయిపోతున్నది. 15 రోజుల్లో పాసుబుక్ ఇంటికి వస్తున్నది. రూపాయి కూడా లంచం ఎవరికి ఇయ్యాల్సిన పనిలేదు. మన వేలి ముద్ర వేస్తేనే పని అవుతుంది. మన భూమి ఎక్కడికి పోదు. ల్యాండ్ కన్వర్షన్ కూడా పది నిమిషాల్లో అయిపోతున్నది. గతంలోనైతే పనులు కావాల్నంటే ఆఫీసుల చుట్టూ తిరుగుడే గాక, కింది నుంచి పైదాక ప్రతి అధికారికి లంచం ఇస్తనే పనయ్యేది. గిప్పుడు మళ్లా ఆ రోజుల్నే కాంగ్రెస్ తీసుకొస్తానంటున్నది. గట్ల చేస్తే మాలాంటి రైతులు ఇబ్బందులు పడుతరు.

– మోత్కూరి చంద్రయ్య, రైతు, మల్లారం, మల్హర్ మండలం

# అభివృద్ధిలో అగ్రగామి భూపాలపల్లి

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన
- మళ్లీ గెలిపిస్తే కేసీఆర్ సహకారంతో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్త
- ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



నియోజకవర్గ పనులను కేసీఆర్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, చిత్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : గడిచిన ఐదేళ్లలో సీఎం కేసీఆర్ సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తీసుకవచ్చి భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మరోసారి ఆశీర్వదిస్తే అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లి అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించి పెద్ద మొత్తంలో నిధులు కేటాయించారని తెలిపారు. వీటితో సమీకృత కలెక్టరేట్, జిల్లా పోలీస్ కార్యాలయం, మెడికల్ కళాశాల, సింగరేణి కార్మికులకు డబుల్ బెడ్ రూం క్వార్టర్లు, నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. భూపాలపల్లికి ఇంజినీరింగ్ కళాశాల, మైనింగ్ కళాశాల, ఐటీ టవర్ ఇవ్వాలని, చిట్యాల మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, గోరికొత్తపల్లి మండలాభివృద్ధికి నిధులు ఇవ్వాలని వేదికపై ఉన్న సీఎం కేసీఆర్‌ను కోరారు. ఇప్పటికే సీఎం కేసీఆర్ బైపాస్ రోడ్డును మంజూరు చేశారని, త్వరలో ప్రారంభం అవుతుందన్నారు. తన గెలుపును సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని, తద్వారా కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చూడాలని ప్రజలను కోరారు. సభలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్, వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభారఘుపతిరావు, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, ఎంపీపీ మందల లావణ్యా సాగర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేశ్‌గౌడ్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనర్సింహారావు, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితెల సమ్మయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్‌నాయక్, సీనియర్ నాయకులు పైడిపల్లి రమేశ్, కుంచాల సదావిజయ్‌కుమార్, భారతక్క పాల్గొన్నారు.



### కేసీఆర్ మూడోసారి సీఎం కావాలి

– ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

కేసీఆర్‌ను మూడోసారి సీఎంగా చూసేందుకు ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలిపించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14ఏళ్లు అవిశ్రాంత ఉద్యమం జరిగిందని, కేసీఆర్ మొక్కవోని దీక్షతో ఉద్యమాన్ని ముందుకు నడిపించారని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లలో భారత దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని రంగాల్లో ముందంజలో నిలిపి ఆదర్శంగా నిలిపారని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం ఒకప్పుడు ఎలా ఉండే.. ఇప్పుడు ఎలా ఉంది.. అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదనే సామెత ఉంది. భూపాలపల్లి విషయంలో కేసీఆర్ మనం అడగకుండానే అన్నీ ఇచ్చి అభివృద్ధిలో ముందంజలో నిలిపాడన్నారు.

# పేదింటి నన్ను కేసీఆర్ అక్కున చేర్చుకున్నడు

- ములుగు నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలిపిండు
- మిమ్మల్ని చూస్తుంటే గెలిచినంత ఆనందమేస్తున్నది
- కేసీఆర్ ఏం చేశాడు అనేటోళ్లకు నియోజకవర్గ అభివృద్ధే సమాధానం
- ప్రజా ఆశీర్వాద సభలో బడే నాగజ్యోతి




ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి

ములుగు, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : లక్షల కోట్ల రూపాయలు ఉంటేనే రాజకీయాల్లో అవకాశాలు రాని ఈ రోజుల్లో సీఎం కేసీఆర్ తనను అక్కున చేర్చుకుని ములుగు బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలిపారని బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ అంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన గొప్ప నాయకుడన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ కోట్ల రూపాయలు ఉన్న అభ్యర్థులను వెతుకుతుంటే త్యాగాల కుటుంబ అమరత్వాన్ని ఉన్నత స్థానంలో నిలపడానికి నన్ను కేసీఆర్ ప్రజల ముందు నిలిపారన్నారు. నన్ను దీవించేందుకు సభకు వచ్చిన ప్రజలను చూస్తేంటే సారు ప్రయోగం సఫలమైన ఆనందం తనకు కలుగుతున్నదన్నారు. ప్రజల ఉత్సాహం చూస్తుంటే సమ్మక్క–సారలమ్మ, జంపన్న, పగిడిద్దరాజు నా తరపున ప్రత్యర్థితో యుద్ధం చేస్తున్నట్లు అనిపిస్తున్నదన్నారు. తనకంటూ ఏ కుటుంబం, ఏ కోరికలు లేవని, ఇచ్చిన మాట కోసం సచ్చేదాక పని చేసే తత్వమే తనలో ఉందని తెలిపారు. అవ్వా, అయ్యా లేరని, వారు మాట నిలబెట్టుకునే తత్వాన్ని తనకు ఇచ్చారన్నారు. ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని, తనను సాదుకున్న, సంపుకున్న మీరేనని అన్నారు. ఇయాల కొంత మంది సీఎం కేసీఆర్ ఏం చేశాడని అడుగుతున్నారని, అందరు వెక్కిరిస్తుంటే ఒక్కడై నిలిచి తెలంగాణను తెచ్చాడని అన్నారు. తెలంగాణ పల్లెలన్నీ తిరిగి వారు పడుతున్న గోస చూసి వారి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యే అయినోళ్లు వెనుకపడిన ఈ ప్రాంతం కోసం ఏ నాడూ ఆలోచించలేదని, కానీ, సీఎం కేసీఆర్ ఈ ప్రాంతం కోసం ఆలోచించి ములుగును జిల్లా, మున్సిపాలిటీగా చేశాడన్నారు. మల్లంపల్లిని మండలం చేశారని, ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ చేశారని తెలిపారు. దీంతో పాటు మెడికల్ కళాశాల ఇచ్చాడని, వైద్యాన్ని సైతం అన్ని విధాలుగా అభివృద్ధి చేశారని వివరించారు. రాష్ట్రంలోని హెల్త్ ప్రొఫైల్‌ను ములుగు నుంచి మొదలు పెట్టారని తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవన్నీ కనిపించడంలేదా అని ప్రశ్నించారు. మా గూడేలు, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దే అన్నారు. ములుగు నియోజకవర్గంపై సీఎం కేసీఆర్ ఎంతో ప్రేమ చూపారని, మరింత ప్రేమ చూపించి అభివృద్ధి చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్–1 స్థాయికి తీసుకెళ్లాలని ప్రజల తరపున నాగజ్యోతి సీఎంను కోరారు. సభలో ములుగు నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్జి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు వీరమల్ల ప్రకాశ్‌రావు, ఏరువ సతీశ్‌రెడ్డి, మెట్టు శ్రీనివాస్, మానుకోట మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, ములుగు ఎంపీపీ గండ్రకోట శ్రీదేవీ సుధీర్‌యాదవ్, జడ్పీటీసీ భవాని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.